
సాక్షి అనంతపురం

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024



కరువు మండలాలకు కొర్రీ

కరువు మండలాల గుర్తింపు విషయంలో కూటమి ప్రభుత్వం కొర్రీలు వేసే పరిస్థితి కనిపిస్తోంది. 10లో



టమాట కిలో రూ.26

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.26 పలికింది. కనిష్టం రూ.13, సరాసరి రూ.20 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.7°/ 19.9°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తిగా తాడిపత్రి వాసి



హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేస్తున్న చల్లా గుణరంజన్

తాడిపత్రి రూరల్: తాడిపత్రి మండలం చల్లవారి పల్లికి చెందిన చల్లా గుణరంజన్ సోమవారం హైకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణం చేశారు. తాడిపత్రి పట్టణంలోని అరబిందో పాఠశాలలో 10వ తరగతి వరకు ఆయన చదివారు. మాజీ మంత్రి చల్లా సుబ్బరాయుడు సోదరుడు చల్లా నారాయణ కుమారుడే జస్టిస్ గుణరంజన్. గతంలో వీరి బంధువు చల్లా కొండయ్య హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఈయన కూడా చల్లవారిపల్లివాసి కావడం గమనార్హం.

సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న నూతన డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: సమస్యలపై ప్రజల నుంచి అందే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని నూతన డీఆర్‌ఓ ఎ.మలోల జిల్లా అధికారులకు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, పాత డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 295 వినతులు అందాయి.

- హార్టిసెట్–2024లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన తనకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఆర్థిక సహాయం చేయాలని బెళుగుప్ప మండలం దుద్దేకుంట గ్రామానికి చెందిన విజయలక్ష్మి విన్నవించింది. బీఎస్సీ హార్టికల్చర్ కోర్సు చేసేందుకు అన్నమయ్య జిల్లా ఆనందరాజ పేటలోని కళాశాలలో సీటు వచ్చిందని తెలిపింది. దూరప్రాంతానికి వెళ్లి విద్యను అభ్యసించే ఆర్థిక స్తోమత లేదని, 'అనంత ఆణిముత్యాలు' ద్వారా ఆర్థిక సాయం చేయాలని కోరింది.

పీహెచ్‌సీల తనిఖీ

ఉరవకొండ: మండలంలోని రాకెట్ల, కొకుంట్ల పీహెచ్‌సీలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి సోమవారం తనిఖీ చేశారు. ఆయా పీహెచ్‌సీల్లోని ల్యాబ్, ప్రసూతి, మందుల గదులను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులతో ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి బత్తుల కోదండ రామిరెడ్డి, రాకెట్ల, కొకుంట్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పావని, లక్ష్మీచందన, ల్యాబ్ టెక్నీషియన్ భవాని తదితరులు పాల్గొన్నారు.

నశాలానికి నిషా



- భారీగా పెరుగుతున్న మద్యం కిక్కు
- ఉదయం 9 నుంచే మద్యం తాగి వీధుల్లో పడిపోతున్న యువకులు
- నిమిషానికి సగటున 64 లీటర్ల మద్యం తాగుతున్నట్లు వెల్లడి
- ఉమ్మడి జిల్లాలో 12 రోజుల్లోనే రూ. 81 కోట్ల మద్యం విక్రయం
- ఇప్పటికే గ్రామాల్లో 'తమ్ముళ్ల' ఆధ్వర్యంలో బెల్టుషాపులు
- ఎమ్మెల్యేలతో మద్యం షాపుల నిర్వాహకుల సంప్రదింపులు
- ప్రజాప్రతినిధులకు మట్టి, ఇసుక తర్వాత ఆదాయ వనరుగా మద్యం



రాయదుర్గం నియోజకవర్గంలోని ఓ గ్రామంలో ఏర్పాటైన బెల్టుషాపు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో మద్యం కిక్కు నశాలానికి ఎక్కించారు. పల్లె పల్లెనా ప్రజలు తాగుతూ తూలుతూ ఉండేలా చేస్తున్నారు. 99 రూపాయలకే చీప్ లిక్కర్ అంటూ టీడీపీ నేతలే బ్రాండ్ అంబాసిడర్‌లుగా మారి అమ్మకాలు భారీగా పెంచుతున్నారు. మద్యం నియంత్రించాల్సిన నేతలే ఉదయం 8 గంటల నుంచే అమ్మకాలు ప్రారంభించి ఆదాయ మార్గానికి రాచబాటలు వేసుకున్నారు. నాణ్యమైన మద్యం అందించకుండా, ధరలు తగ్గించకుండా, బెల్టుషాపులను కట్టడి చేయకుండా యువతను, సామాన్యులను మత్తులో జోగేలా చేస్తున్నారు. రెండు జిల్లాల్లోనూ మట్టి, ఇసుక తర్వాత ఎమ్మెల్యేలకు మద్యం విక్రయాలు ప్రధాన ఆదాయ వనరుగా మారాయి.

నిమిషానికి 64 లీటర్లు..!

అనంతపురంతో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలో నిమిష నిమిషానికీ నిషా ఎక్కిస్తున్నారు. 2024 జూన్‌కు ముందు రోజుకు రూ.3 కోట్ల మద్యం విక్రయాలు జరిగితే మహా గొప్ప. కానీ ఇప్పుడు రూ.7 కోట్ల వరకు జరుగుతున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి. రోజుకు 12 గంటల పాటు మద్యం షాపులు నడిస్తే నిమిషానికి 64 లీటర్ల మద్యం వినియోగమవుతున్నట్లు అంచనా. అంటే గంటకు 3,840 లీటర్లు పైగా మద్యం అమ్ముడవుతున్నట్లు లెక్క. కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చాక గడిచిన 12 రోజుల్లో 8.56 లక్షల లీటర్ల మద్యం ప్రభుత్వం విక్రయించగా, 65 శాతం అంటే 5.52 లీటర్ల మద్యం అమ్ముడయినట్టు తేలింది. దీనిద్వారా ప్రభుత్వానికి రోజుకు రూ.6.76 కోట్ల ఆదాయం చేరింది.

బెల్టుషాపులు మొదలు..

రెండు జిల్లాల్లోనూ బెల్టుషాపులు మొదలయ్యాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే గ్రామాల్లో మద్యం అమ్ముతున్నారు. పర్మిట్ రూముల కోసం ఎమ్మెల్యేలు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే 90 శాతం మద్యం షాపులు ఎమ్మెల్యేల చేతుల్లో ఉన్నాయి. అనంతపురం అర్బన్‌లో ఎమ్మెల్యేకు చెందిన మద్యం షాపులను ఉదయం 8.30 గంటలకే తెరిచి విక్రయిస్తున్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాదు సిండికేట్ పరిధిలోకి రానివారిని ఇప్పటికీ బెదిరిస్తున్నట్లు తెలిసింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ లేదా 30 శాతం కమీషన్.. రెండింటిలో ఏదైనా ఒక దానికి ఒప్పుకోవాల్సిందేనని పట్టుబడుతున్నారు.

బెల్టుషాపులు తెరిస్తే కేసులు

జిల్లాలో ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తాం. ఈ మేరకు ఎక్సైజ్ సీఐలకూ ఆదేశాలిచ్చాం. రాయదుర్గంలో బెల్టుషాపు నిర్వహణ వార్త వచ్చిన నేపథ్యంలో సీఐకి మెమో ఇచ్చాం.ఉదయం 10 గంటలకంటే ముందు షాపు తెరిచినా, రాత్రి 10 గంటలు దాటాక షాపు తెరిచి ఉంచినా కేసులు తప్పవు.

– రామమోహన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఈనెల 16వ తేదీ నుంచి 28వ తేదీ ఉదయం 11 గంటల వరకు ఉమ్మడి జిల్లాలో మద్యం విక్రయాలు

వైన్‌షాపులకు వెళ్లిన మద్యం	95,142 కేసులు
లీటర్లలో	8,56,278
వినియోగం అయిన మద్యం	5,56,580 లీటర్లు
గంటకు సరాసరి వినియోగం	3,865 లీటర్లు
నిమిషానికి తాగుతున్నది	64.41 లీటర్లు
12 రోజుల్లో బీర్ల అమ్మకాలు	25,305
బీర్ల అమ్మకాలు (లీటర్లలో)	16,448
మద్యం, బీర్లనుంచి వచ్చిన సొమ్ము	రూ.81,21,68,724
అనంతపురం జిల్లా నుంచి	రూ.50,84,42,652
'శ్రీ సత్యసాయి' జిల్లా నుంచి	రూ.30,37,26,072
రెండు జిల్లాల నుంచి రోజుకు ఆదాయం	రూ.6,76,80,727
(మద్యం షాపులు పనిచేసే వేళల్లో మాత్రమే వినియోగాన్ని లెక్కించడం జరిగింది)	

దొంగ పత్రాలతో కబ్జాకు యత్నిస్తున్నారు

- టీడీపీ నేత అండతో రెచ్చిపోతున్నారు
- 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'లో బాధితుడి ఫిర్యాదు
- గుంతకల్లులో కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన కార్యక్రమం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

గుంతకల్లు: గుంతకల్లులోని ఆలూరు రోడ్డు షికారి కాలనీ వద్ద ఉన్న తన ఎకరన్నర స్థలాన్ని కబ్జా చేయడానికి టీడీపీ నాయకుడు ఆర్‌ఆర్ రమేష్ సహాయంతో కొందరు యత్నిస్తున్నారని వేణుగోపాల్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. సోమవారం గుంతకల్లు పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ వినోద్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ హాజరయ్యారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. గుంతకల్లు రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా దాదాపు 410 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా తన సమస్యపై వేణుగోపాల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గౌరవ కుళ్లాయప్పతోపాటు ఆయన కుమారులు శివయ్య, శంకరయ్య, కృష్ణలు దొంగ పత్రాలు సృష్టించారన్నారు. పామిడికి చెందిన టీడీపీ నాయకుడు ఆర్‌ఆర్ రమేష్ స్థానిక ప్రజాప్రతినిధి అండతో తనపై దౌర్జన్యం చేస్తున్నాడని వాపోయారు. తనకు రక్షణ కల్పించడంతోపాటు స్థలం కబ్జాకు గురి కాకుండా చూడాలని వేడుకున్నారు.

- జగనన్న లేవుట్‌లో తనకు కేటాయించిన ఇంటి స్థలంలో నాగరాజు అనే వ్యక్తి దౌర్జన్యం చేసి ఇల్లు కట్టుకుంటున్నాడని దివ్యాంగురాలు గౌసియా బేగం ఫిర్యాదు చేశారు. ఇదేమని ప్రశ్నిస్తే ఇష్టం వచ్చిన వాళ్లకు చెప్పుకో అంటూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.
- గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని సర్వే నంబర్ 453లోని 168 గజాల స్థలంలో తాను నిర్మించిన ఇళ్లకు దొంగ పత్రాలు సృష్టించి అక్రమంగా అమ్మేశారని టీసీ చంద్రశేఖర్ రెడ్డి కలెక్టర్‌కు ఎదుట వాపోయారు. ఉరవకొండకు చెందిన జీ మహ్మమద్ అనే వ్యక్తి దౌర్జన్యం చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.
- ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదుగురు వైద్యులు సెలవులో వెళ్లారని, డిప్యూటేషన్‌పై భర్తీ చేసి రోగులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని న్యాయవాది రాజశేఖర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.
- ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులతో సమీక్షించారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. భూ సమస్యలతో పాటు రెవెన్యూ, సివిల్ సప్లయిస్ పరిధిలోనే ఎక్కువ సమస్యలు వస్తున్నాయన్నారు. జిల్లాలో 792 కోర్టు కేసులు ఉన్నాయని, ఆయా శాఖల పరిధిలో రోజుకో కేసును పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలన్నారు.

భూ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలి

గుంతకల్లు: ప్రభుత్వ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం గుంతకల్లు ఆర్‌డీఓ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌హెచ్ 544, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ఏపీ ట్రాన్స్‌కో తదితర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణలో ఎలాంటి సమస్యలెదురైనా వెంటనే పరిష్కరించాలన్నారు. భూములు కేటాయించకపోతే ప్రాజెక్టులు పూర్తి కాని పరిస్థితి ఉంటుందని, దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఉపాధి హామీ పథకంపై డ్వామా పీడీ, ఎంపీడీఓ, ఏపీడీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, డీఆర్‌ఓ మలోల, ఆర్‌డీఓ శ్రీనివాస్, ఎన్‌హెచ్ అధికారి తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా ప్రజల భద్రతే ధ్యేయం

- ఎస్పీ జగదీష్

అనంతపురం: జిల్లా ప్రజలకు భద్రత కల్పించడమే తమ ధ్యేయమని ఎస్పీ పి. జగదీష్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోలీసు అమర వీరుల త్యాగాలు, సేవలను గుర్తుచేసుకుంటూ ప్రతి ఏటా అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు వారోత్సవాలను చేపడుతున్నారన్నారు. అందులో భాగంగా పోలీసు ఆయుధాలు, పరికరాలను ప్రదర్శనగా ఉంచి విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. రక్తదాన కార్యక్రమాలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. రక్తదానం చేయడం అంటే ప్రాణాప్రాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మ కల్పించడమేనని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో రక్తం పాత్ర కీలకమన్నారు. మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటం అదృష్టంగా భావించాలన్నారు. అనంతరం 11 మంది పోలీసు, హోంగార్డుల కుటుంబాలకు రూ.2.30 లక్షలను చెక్కుల రూపంలో ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి, అనంతపురం రూరల్ డీఎస్పీ టి. వెంకటేశ్వర్లు, పోలీసు డాక్టర్ వెంకటేశ్ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌ఎస్‌ఐ జాఫర్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న పోలీసును అభినందిస్తున్న ఎస్పీ జగదీష్

'పోలీసు స్పందన'కు 92 వినతులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (స్పందన) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 92 వినతులు అందాయి. ఎస్పీ జగదీష్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని, పరిష్కారానికి చొరవ తీసుకోవాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'పచ్చ' కళ్లు.. 'పిచ్చి' రాతలు

ఫ్రీహోల్డ్‌పై అసత్యాలతో 'ఈనాడు' కథనం

- భూదోపిడీ అంటూ గత ప్రభుత్వంపై ఏడుపు
- 34,497 ఎకరాల ఫ్రీహోల్డ్ ద్వారా 5,900 మంది రైతులకు ప్రయోజనం
- అసైనీలు కాకుండా ఇతరుల పేరున 48 ఎకరాల రిజిస్ట్రేషన్
- రికార్డులు సరిగా లేని 8,313 ఎకరాల పునఃపరిశీలన
- వీటిని అక్రమాలంటూ భూతద్దంలో చూపిన వైనం

- పచ్చ కళ్లకు అంతా పచ్చగానే కనిపిస్తుంది. టీడీపీ కరపత్రికగా ముద్రవేసుకున్న 'ఈనాడు' కథ అలానే ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మంచి... పచ్చపారతో చూస్తున్న ఆ పత్రికకు కనిపించదు. జరిగిన కొండంత మేలును వదిలేసి కోడిగుడ్డు మీద ఈకలు పీకిన చందంగా కనీస ఆధారాలు లేకుండా అడ్డగోలు రాతలతో అసత్య కథనం వండివార్చింది. అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ పరిశీలన నేపథ్యంలో 'భూదోపిడీ' అంటూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు యత్నించి నవ్వులపాలైంది.



ఈనాడు కథనంపై ఓ అధికారి స్పందన ఇదీ...

'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ శాఖలోని ఓ ఉన్నతస్థాయి అధికారి స్పందించారు. ఇలాంటి కథనాల ద్వారా ఆ పత్రిక రోజురోజుకూ తన విశ్వసనీయత కోల్పోతోందని చెప్పారు. 'దోపిడీ జరిగిందంటూ అభాండం వేసినప్పుడు కనీసం గానైనా ఆధారాలు చూపించాలి. 34,497 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేస్తే అందులో రిజిస్ట్రేషన్ జరిగింది 111 ఎకరాలు మాత్రమే. అక్రమమని తేలినవి 48 ఎకరాలు అని వారే చెబుతారు. రికార్డులు సరిగా లేని 8,313 ఎకరాలకు సంబంధించిన ఫైళ్లు పునపరిశీలన చేస్తున్నారు. ఇవి అక్రమమని వారే ఎలా నిర్ధారిస్తారు? ఇలాంటి వాటి ద్వారా తమను తాము దిగజార్చుకుని చులకనవుతున్నారు' అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

అనంతపురం అర్బన్: జీవనోపాధి కోసం అసైన్డ్ భూములు సాగు చేసుకుంటున్న వారికి యాజమాన్య హక్కు కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టింది. జిల్లావ్యాప్తంగా 182 గ్రామాల్లో 34,497.149 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. తద్వారా 5,900 మంది రైతులకు ప్రయోజనం కలిగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ పరిశీలనకు ఆదేశాలిచ్చింది. దీంతో రెవెన్యూ యంత్రాంగం పరిశీలన ప్రక్రియను పక్కాగా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 166 గ్రామాల్లో 19,354.87 ఎకరాల పరిశీలన పూర్తిచేశారు. ఇంకా 15,142.28 ఎకరాలకు సంబంధించి ఫైళ్లను పరిశీలించాల్సి ఉంది. వీటిలో 8,313.19 ఎకరాలకు సంబంధించి ఫైళ్లను పునఃపరిశీలన చేస్తున్నారు.

పకడ్బందీగా..

ముగ్గురు డిప్యూటీ కలెక్టర్ల పర్యవేక్షణలో మూడు రెవెన్యూ డివిజన్లకు సంబంధించి ఫ్రీహోల్డ్ ఫైళ్ల పరిశీలన ప్రక్రియను కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. మొత్తం తొమ్మిది బృందాల ద్వారా పరిశీలన ప్రక్రియ జరుగుతోంది.

- అనంతపురం డివిజన్ పరిధిలో 71 గ్రామాల్లో 7,873.702 ఎకరాలకు ఫ్రీహోల్డ్ కల్పించారు. ఇప్పటి వరకు 65 గ్రామాల్లో 6,039.072 ఎకరాలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. 6 గ్రామాల్లోని 1,834.63 ఎకరాల పరిశీలన జరుగుతోంది.
- గుంతకల్లు డివిజన్ పరిధిలో 52 గ్రామాల్లో 2,537.207 ఎకరాలకు ఫ్రీహోల్డ్ కల్పించారు. వీటికి సంబంధించి ఫైళ్ల పరిశీలన ప్రక్రియ పూర్తి చేశారు.
- కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 59 గ్రామాల్లో 24,086.24 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. ఇప్పటి వరకు 49 గ్రామాల్లో 10,778.59 ఎకరాలకు చెందిన ఫైళ్ల పరిశీలన పూర్తి చేశారు. 10 గ్రామాల్లో 13,307.65 ఎకరాలకు సంబంధించిన ఫైళ్లు పరిశీలన చేస్తున్నారు.

8,313 ఎకరాలు పునఃపరిశీలన

జిల్లావ్యాప్తంగా ఫ్రీహోల్డ్ జరిగిన 34,497.149 ఎకరాలకు సంబంధించి భూములపై పరిశీలన చేస్తున్నారు. ఇందులోనూ రికార్డులు సక్రమంగా లేని 8,313.89 ఎకరాలకు సంబంధించి ఫైళ్లను పునఃపరిశీలన చేయనున్నారు. అత్యధికంగా కళ్యాణదుర్గం డివిజన్‌లో 5,782.18 ఎకరాలు ఉన్నాయి. ఈ డివిజన్ పరిధిలోని కంబదూరు మండల రెవెన్యూ కార్యాలయంలో కొన్ని ఏళ్ల క్రితం భూ రికార్డులు కాలిపోయాయి. దీంతో ఈ మండలం నుంచి వచ్చిన 4,050.03 ఎకరాలకు సంబంధించి ఫైళ్లను ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. ఇక డి.హీరేహాళ్‌లో 1,005.94 ఎకరాలకు చెందిన ఫైళ్ల పరిశీలన చేస్తున్నారు.

కేవలం 111 ఎకరాలు రిజిస్ట్రేషన్..

ఫ్రీహోల్డ్ చేసిన ఎకరాల్లో 34,497 ఎకరాల్లో కేవలం 111 ఎకరాలు రిజిస్ట్రేషన్ జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో 48 ఎకరాలు మాత్రమే పీఓటీ (ప్రివెన్షన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) కింద అసైన్డ్ దారుడు కాకుండా మరొకరి ద్వారా రిజిస్ట్రేషన్ జరిగినట్లు నిర్ధారించారు. ఇవి కూడా గుత్తి, డి.హీరేహాళ్‌లో జరిగినట్లు గుర్తించారు. మిగిలిన 71 ఎకరాలు రిజిస్ట్రేషన్ సక్రమమేనని నిర్ధారించినట్లు తెలిసింది.

అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ ఇలా

ఫ్రీహోల్డ్ జరిగిన గ్రామాలు	182
ఫ్రీహోల్డ్ జరిగిన విస్తీర్ణం	34,497.149
ఇప్పటి వరకు పరిశీలన జరిగింది	19,354.87 ఎకరాలు
పరిశీలన జరుగుతోంది	15,142.28 ఎకరాలు
ఇందులో పునఃపరిశీలన చేస్తోంది	8,313.89 ఎకరాలు
ఫ్రీహోల్డ్ తరువాత జరిగిన రిజిస్ట్రేషన్	111 ఎకరాలు
అసైనీలు కాకుండా జరిగిన రిజిస్ట్రేషన్	48 ఎకరాలు

ప్రక్రియ పూర్తి కావొచ్చింది

అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్ పరిశీలన ప్రక్రియ పూర్తికావొచ్చింది. మూడు డివిజన్ల పరిధిలో 34,497 ఎకరాలు ఫ్రీహోల్డ్ చేశారు. వీటికి సంబంధించి ఫైళ్ల పరిశీలన జరుగుతోంది. ఫ్రీహోల్డ్ జరిగిన మొత్తం ఎకరాల్లో 111 ఎకరాలు రిజిస్ట్రేషన్ జరిగినట్లు గుర్తించారు. ఇందులో 48 ఎకరాలు అసైన్డ్‌దారుడు కాకుండా పీఓటీ కింద ఇతరులు రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. ప్రక్రియ పూర్తైన తరువాత ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం.

– వి.వినోద్‌కుమార్, కలెక్టర్

అన్ని వర్గాలకూ మేలు..

అసైన్డ్ భూములు సాగు చేస్తున్న రైతుల శ్రేయస్సే లక్ష్యంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అమలు చేసింది. అసైన్డ్ భూములను 20 ఏళ్లుగా సాగు చేస్తున్న వారికి యాజమాన్య హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుని రైతులకు మేలు చేసింది. ఇలాంటి మంచి కార్యక్రమాన్ని టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఎప్పుడూ చేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పుణ్యమా అని జిల్లాలో దాదాపు 5,900 మంది రైతులకు మేలు జరిగింది. ఇందులో అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు ఉన్నారు.

ఉచిత సిలిండర్లకు బుకింగ్

- జేసీ శివనారాయణ శర్మ వెల్లడి



అనంతపురం అర్బన్: అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందజేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. మంగళవారం నుంచి బుకింగ్ చేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించి వివరాలను సోమవారం ఆయన తెలియజేశారు. గ్యాస్ కనెక్షన్ వినియోగంలో ఉన్న వారే అర్హులన్నారు. ఆధార్, బియ్యం కార్డు కలిగి ఉండాలన్నారు. గ్యాస్ కనెక్షన్‌తో బియ్యం కార్డు, ఆధార్‌కార్డు అనుసంధానమైన డేటాను మిగతా శాఖ డేటాబేస్‌లో సరిచూసుకుని అర్హులైన లబ్ధిదారులకు సిలిండర్లు పంపిణీ చేస్తారని తెలిపారు. లబ్ధిదారులు ముందుగా సొమ్ము చెల్లించి సిలిండర్ పొందాల్సి ఉంటుందన్నారు. అనంతరం 24 గంటల నుంచి 48 గంటల్లోగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో నగదు జమ అవుతుందని తెలిపారు. 31వ తేదీ నుంచి వినియోగదారులకు పంపిణీ చేసిన సిలిండర్ల డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీ నుంచి 2025 మార్చి వరకు మొదటి సిలిండర్‌కు బుక్ చేసుకోవచ్చని, ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ చొప్పున ఒక ఆర్థిక సంవత్సరంలో మూడు సిలిండర్లు పంపిణీ చేస్తారని వెల్లడించారు.

క్లుప్తంగా

గుత్తి కోటను సందర్శించిన పార్లమెంట్ పరిశోధనా బృందం



గుత్తి కోటను సందర్శించిన బృందం సభ్యులు

గుత్తి: చరిత్రాత్మకమైన గుత్తి కోటను పార్లమెంట్ పరిశోధనా బృందం సభ్యులు దీపక్, దివిటి సోమవారం సందర్శించారు. వారికి గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, గైడ్ రమేష్, ఆర్కాలజీ సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గుత్తి కోట ప్రాముఖ్యత, గొప్పతనాన్ని గైడ్ రమేష్, విజయ భాస్కర్ వివరించారు. కోటను పరిశీలించిన అనంతరం చాలా అద్భుతంగా ఉందని పార్లమెంట్ పరిశోధనా బృందం సభ్యులు పేర్కొన్నారు.

కలసికట్టుగా విధులు నిర్వర్తిద్దాం

- నూతన డీఆర్వో ఎ.మలోల



డీఆర్వో మలోలకు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, డీటీలు

అనంపురం అర్బన్: ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రజలకు సత్వర సేవలు అందించేందుకు అందరూ కలసికట్టుగా విధులు నిర్వర్తిద్దామని ఉద్యోగులకు నూతన డీఆర్వో ఎ.మలోల పిలుపునిచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారిగా (డీఆర్వో)గా నియమితులైన ఆయన సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు కలెక్టర్ వి.వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ నారాయణశర్మను వారి క్యాంపు కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లాపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. గతంలో అనంతపురం, కళ్యాణదుర్గం ఆర్డీఓగా పనిచేసినట్లు గుర్తు చేశారు. రెవెన్యూ శాఖ పరిధిలో ప్రజల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన మలోలకు కలెక్టరేట్ పరిపాలనాధికారి అలెగ్జాండర్, డిప్యూటీ తహసీల్దార్లు ఆంజనేయులు, లీలాకాంత్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, దివాకర్‌రావు, ఆర్ఐ అఫ్జల్, సిబ్బంది రామప్ప, తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కరువు మండలాలకు కొర్రీ

- అధిక వర్షాల నెపంతో మండలాల జాబితా కుదించే పరిస్థితి
- జూన్, జూలై మధ్య 30 నుంచి 50 రోజుల సుదీర్ఘ డ్రైస్పెల్
- జూన్ మొదటి పక్షం, ఆగస్టు మూడో వారంలో మాత్రమే అధిక వర్షపాతం
- పంటలన్నీ దెబ్బతిన్నా... కరువు జాబితాలో కనిపించని మండలాలు



ఆత్మకూరు మండలం సనప గ్రామంలో పంట కోత ప్రయోగం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: కరువు మండలాల గుర్తింపు అంశంపై కూటమి సర్కారు కొర్రీలు వేసే పరిస్థితి కనిపిస్తోంది. ఖరీఫ్‌లో ఓవరాల్‌గా సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదు కావడాన్ని ఆసరాగా చేసుకుని మండలాల సంఖ్యను కుదించే పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. వర్షపాతం, గాలిలో తేమ శాతం, పంటల సాగు విస్తీర్ణం, భూగర్భజలమట్టం, పచ్చదనం తదితర వివరాలను సేకరించిన సర్కారు... వాటినే ప్రామాణికంగా తీసుకుని నెలాఖరు నాటికి కరువు మండలాల జాబితాను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అధిక వర్షపాతం నమోదైనందున కరువు జాబితాలో ఇటు అనంతపురం, అటు శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో మండలాల సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది.

వర్షం ఎక్కువైనా... దెబ్బతిన్న ఖరీఫ్

జూన్ నుంచి సెప్టెంబర్ వరకు ఖరీఫ్ పంట కాలంగా పరిగణిస్తారు. ఈ నాలుగు నెలల కాలంలో కురిసిన వర్షాలు, వాతావరణ పరిస్థితులు, పంటల సాగు, నీటిమట్టం తదితర గణాంకాల ఆధారంగా కరువు మండలాల జాబితా ప్రకటించే అవకాశం ఉంది. అయితే జిల్లాకు సంబంధించి నాలుగు నెలల ఖరీఫ్‌లో సాధారణ వర్షపాతం 319.6 మి.మీ కాగా 34.9 శాతం అధికంగా 431.3 మి.మీ నమోదైంది. పంటల సాగు కూడా 3.46 లక్షల హెక్టార్లకు గానూ 92 శాతంతో 3.20 లక్షల హెక్టార్లలో వేశారు. వర్షాకాలంలో కూడా వేసవి మాదిరిగా జూలై, ఆగస్టులో అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత నెలకొంది. అలాగే 31 మండలాల్లో కూడా జూన్, జూలై, ఆగస్టు మధ్య కాలంలో 30 నుంచి 50 రోజులు పాటు వర్షమే లేకుండా సుదీర్ఘ వర్షపాతం విరామాలు (డ్రైస్పెల్స్) నమోదయ్యాయి. కొన్ని మండలాల్లో అయితే రెండు నుంచి మూడు వరకు డ్రైస్పెల్స్ రికార్డయ్యాయి. పంట కోత ప్రయోగాలు పరిగణనలోకి తీసుకున్నా వేరుశనగ, ఆముదం, పత్తి తదితర అన్ని పంటల్లో కూడా దిగుబడులు గణనీయంగా తగ్గాయి. ఎకరాకు రెండు బస్తాలు కూడా వేరుశనగ దిగుబడులు రాలేదని ఫలితాలు వెల్లడి చేశాయి. కంది మినహా దాదాపు అన్ని పంటలూ బాగా దెబ్బతిన్నాయి. వర్షాలు మినహాయిస్తే... కరువు మండలాలు ప్రకటించడానికి మిగిలిన ప్రామాణికాలు ఎక్కువగానే ఉన్నా.. ఆ దిశగా ప్రభుత్వం దృష్టి సారించకపోవడం గమనార్హం.

ఖరీఫ్‌లో వర్షపాతం ఇలా

నెల	సాధారణం	కురిసింది	ఎక్కువ/తక్కువ
జూన్	61.0 మి.మీ.	147.7 మి.మీ.	142.1 శాతం ఎక్కువ
జూలై	63.9 మి.మీ.	24.4 మి.మీ.	61.8 శాతం తక్కువ
ఆగస్టు	83.8 మి.మీ.	210.8 మి.మీ.	151.6 శాతం ఎక్కువ
సెప్టెంబర్	110.9 మి.మీ.	48.4 మి.మీ.	56.4 శాతం తక్కువ
మొత్తం	319.6 మి.మీ.	431.3 మి.మీ.	34.9 శాతం ఎక్కువ

ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం	3,46,741 హెక్టార్లు
సాగైన పంటల విస్తీర్ణం	3,20,071 హెక్టార్లు
పంటల సాగు విస్తీర్ణం శాతం	92 శాతం

జూలై, సెప్టెంబర్‌లో వర్షాభావం

అవసరమైనప్పుడు కాకుండా అవసరం లేనప్పుడు విస్తారంగా వర్షాలు పడ్డాయి. విత్తుకు, పంట ఎదుగుదకు కీలకమైన జూలై, సెప్టెంబర్‌లో వర్షాలు కురవలేదు. విత్తు ప్రారంభించక మునుపు అంటే జూన్ మొదటి పక్షం, ఆగస్టు మూడో వారంలో మాత్రమే మంచి వర్షపాతం నమోదైంది. జూన్ నెల సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా... తొలి 15 రోజుల్లోనే ఏకంగా 143 మి.మీ నమోదు కావడం విశేషం. మిగిలిన 15 రోజుల్లో కేవలం 4 మి.మీ మాత్రమే కురిసింది. ఇక జూలై నెలంతా పరిస్థితి దారుణంగా ఉంది. అరకొర వర్షాల నడుమ ఏరువాక కొనసాగించారు. ఆగస్టు మొదటి పక్షం కూడా సరైన వర్షాలు పడలేదు. ఆగస్టు 14 నుంచి 22వ తేదీ మధ్య భారీ వర్షాలు కురిశాయి. తర్వాత సెప్టెంబర్ మొదటి వారం మోస్తరుగా కురిసిన వర్షాలు.. చివర్లో చేయిచ్చాయి. ప్రధానంగా జూన్ 15 నుంచి ఆగస్టు 15 మధ్య రెండు నెలల కాలంలో కొన్ని మండలాల్లో 50 రోజుల పాటు చినుకు పడలేదు. దీంతో డ్రైస్పెల్స్ బాగా నమోదయ్యాయి. అనంతపురం, నార్పలలో సాధారణం కన్నా తక్కువగానూ, యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, గార్లదిన్నె, శింగనమల, పుట్లూరు, యల్లనూరు, బుక్కరాయసముద్రం, రాప్తాడు, కుందుర్పి మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగతా 19 మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. ఇలా వర్షాలు గతితప్పడంతో ఖరీఫ్ పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కరువు మండలాల సంఖ్యను కుదిస్తే... రైతులకు తీవ్ర అన్యాయం జరిగే పరిస్థితి ఉందనేది సర్వత్రా అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా చైర్మన్‌గా రామకృష్ణారెడ్డి



డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, బి.దిలీప్‌కుమార్‌ను అభినందిస్తున్న ఆచార్య హేమచంద్రారెడ్డి, తదితరులు

అనంతపురం: 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా' అనంతపురం ఛాప్టర్ నూతన చైర్మన్‌గా డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, సెక్రెటరీగా డాక్టర్ బి.దిలీప్‌కుమార్ నియమితులయ్యారు. రెండేళ్ల పాటు వీరు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఎంబీఏ విభాగంలోని ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా – అనంతపురం ఛాప్టర్‌లో సోమవారం జరిగిన 10వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఐఈఈ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ హాజరై, ప్రసంగించారు. బోర్డు ఆఫ్ కన్వీనర్ ప్రొఫెసర్ వి.శంకర్, డాక్టర్ జి.మమత, డాక్టర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

టపాసుల స్వాధీనం

యల్లనూరు: అక్రమంగా నిల్వ ఉంచిన రూ.7 లక్షల విలువైన టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను పుట్లూరు సీఐ సత్యబాబు, యల్లనూరు, పుట్లూరు ఎస్ఐలు శ్రీరామప్రసాద్, హేమాద్రి సోమవారం వెల్లడించారు. తాడిపత్రికి చెందిన చలపతి, రాజేష్... తమ వ్యాపార నిమిత్తం సరుకు నిల్వ చేసుకునేందుకు గిర్రమ్మ బావి గాలి మిషన్ ఎదురుగా ఉన్న చవ్వా రామసుబ్బారెడ్డికి చెందిన మూడు గదులను అద్దెకు తీసుకున్నారు. సోమవారం ఉదయం టపాసులను తీసుకొచ్చి అన్‌లోడ్ చేస్తున్న సమయంలో పోలీసులు గుర్తించి రికార్డులు పరిశీలించారు. తాడిపత్రిలో అమ్మకాల కోసం టపాసులను కొనుగోలు చేశామని అక్కడ షెడ్డు లేకపోవడంతో ఇక్కడ భద్రపరుస్తున్నట్లు చలపతి, రాజేష్ తెలిపారు. అయితే వాటికి సంబంధించి ఎలాంటి రికార్డులు చూపలేదు. దీంతో టపాసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బిల్లులతో పాటు విక్రయ అనుమతులూ చూపించి సరుకు తీసుకెళ్లాలని సూచించినట్లు సీఐ సత్యబాబు తెలిపారు.

అదిరిందయ్యా.. నవీంద్ర!

- 'ముందస్తు' మామిడి దిగుబడి
- మార్కెట్లో మంచి ధరలకు విక్రయం



మామిడి కాయలను చూపుతున్న రైతు

ఆత్మకూరు: ఆ యువరైతు అందరిలా కాకుండా ప్రత్యేకంగా ఆలోచించాడు. సీజన్‌కు ముందే దిగుబడి తీసి మార్కెట్లో మంచి ధరలకు విక్రయిస్తున్నారు. మండల కేంద్రం ఆత్మకూరులో నవీంద్రరెడ్డి అనే ఓ యువ రైతు తనకున్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలో తొమ్మిదేళ్ల కిందట 300 మామిడి మొక్కలు నాటాడు. ఐదు సంవత్సరాల తర్వాత తొలి కోత మొదలైంది. పెట్టుబడి కింద ఏడాదికి రూ.2లక్షల దాకా ఖర్చు వస్తోంది. మామిడి సీజన్‌కు రెండు నెలలు ముందుగానే దిగుబడి వచ్చేలా ప్రణాళికాబద్ధంగా చేపట్టాడు. ప్రస్తుతం అందరి పొలాల్లో పూత దశ ప్రారంభమైతే.. నవీంద్రరెడ్డి తోటలో పెద్ద పెద్ద సైజులతో మామిడి కాయలు విరగ్గాశాయి. ఇలా ముందుగానే పంట దిగుబడి వచ్చేలా చూసుకోవడం, మంచి ధరలకు విక్రయించడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రైతు తెలిపాడు. పెట్టుబడి ఖర్చులు పోను మూడు రెట్ల ఆదాయం పొందవచ్చని చెబుతున్నాడు.

జేఎన్‌టీయూలో డైరెక్టర్ల మార్పు

అనంతపురం: జేఎన్‌టీయూఏలో పలువురి డైరెక్టర్ల మార్పుచేర్పులు జరిగాయి. ఈ మేరకు వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ డాక్టర్ హెచ్.సుదర్శనరావు ఆదేశాలతో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కీలకమైన అకడమిక్ అండ్ ఆడిట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ ఎ.సురేష్‌బాబు (కంప్యూటర్ సైన్సెస్)ను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా నియామకం చేస్తూ ఆయన స్థానాన్ని ఓటీపీఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్‌కు కేటాయించారు. అలాగే డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్‌గా ఉన్న ప్రొఫెసర్ ఆర్.కిరణ్మయిని ఇండస్ట్రీయల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్‌గా నియమించారు. ఇండస్ట్రీయల్ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్‌గా ఉన్న ప్రొఫెసర్ ఎన్.విశాలిని ట్రిపుల్‌ఈ విభాగం ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆమెకు ఎలాంటి అదనపు బాధ్యతలు అప్పగించలేదు. పులివెందుల వైస్ ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ జీవీ సుబ్బారెడ్డి (కెమిస్ట్రీ)ని ఓటీపీఆర్ఐ డైరెక్టర్‌గా నియమించారు. డిప్యూటేషన్‌పై పులివెందుల నుంచి ఆయన జేఎన్‌టీయూఏకు రానున్నారు. పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె.శేషమహేశ్వరమ్మను పులివెందుల వైస్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. ఎంబీఏ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ టి.నారాయణరెడ్డిని వర్సిటీ ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్‌గా, మెకానికల్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి.చంద్రమోహన్‌రెడ్డిని ఎంబీఏ విభాగాధిపతిగా నియామకం చేశారు. కెమికల్ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ బి.దిలీప్‌కుమార్‌కు ఎన్ఐఆర్ఎఫ్ నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. కెమికల్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎం.కళ్యాణ్ కుమార్‌ను కెమికల్ విభాగాధిపతిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యుత్ బిల్లు చెల్లించలేదని మీటరు ధ్వంసం



లైన్‌మెన్ చేతిలో ధ్వంసమైన విద్యుత్ మీటరు

కంబదూరు: విద్యుత్ బిల్లు చెల్లించడంలో ఆలస్యం చోటు చేసుకోవడంతో ఆగ్రహించిన లైన్‌మెన్ ఏకంగా విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేశాడు. వివరాలు... కంబదూరులోని చెక్‌పోస్టు ప్రాంతంలో వృద్ధ దంపతులు నారప్ప, రాధమ్మ నివాసముంటున్నారు. వీరి ఇంటికి సంబంధించిన విద్యుత్ బిల్లులను కుమారులు క్రమం తప్పకుండా ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తూ వచ్చారు. అయితే సాంకేతిక కారణాలతో ఈ నెల రూ.450 బిల్లు చెల్లించక లేకపోయారు. దీంతో లైన్‌మెన్ బసవరాజు సోమవారం నారప్ప ఇంటి వద్దకెళ్లి బిల్లు చెల్లించాలని నిలదీశాడు. తమకు అరగంట సమయం ఇస్తే నగదు రూపంలో రూ.450 చెల్లించి వస్తామని వృద్ధదంపతులు మొరపెట్టుకున్నా బసవరాజు వినలేదు. నోటికొచ్చినట్లు దుర్భాషలాడుతూ విద్యుత్ మీటర్‌ను ధ్వంసం చేసి, బిల్లు చెల్లించి రసీదు చూపకపోతే కనెక్షన్ కట్ చేస్తానంటూ హెచ్చరిస్తూ వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు లైన్‌మెన్ దౌర్జన్యంపై మండిపడ్డారు. వయసులో పెద్దవారని కూడా చూడకుండా నోటికొచ్చినట్లు దుర్భాషలాడడం సరికాదన్నారు. గతంలోనూ విద్యుత్ బిల్లు చెల్లించలేదంటూ ఓ వినియోగదారుడిపై చెయ్యి కూడా చేసుకున్నాడని మండిపడ్డారు. వినియోగదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న లైన్‌మెన్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.

ఆచూకీ లేని అటెండర్



రామాంజినమ్మ

అనంతపురం: నగరంలోని వెటర్నరీ శాఖలో అటెండర్‌గా పనిచేస్తున్న రామాంజినమ్మ కనిపించడం లేదు. ఈ నెల 17వ తేదీ వరకూ క్రమం తప్పకుండా విధులకు హాజరైన ఆమె 18వ తేదీ నుంచి విధులకు గైర్హాజరయ్యారు. స్వస్థలం గుత్తి కాగా, కారుణ్య నియామకం కింద భర్త ఉద్యోగం ఆమెకు దక్కింది. కుమారుడు హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. పది రోజులుగా ఆమె సెల్‌ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ కావడంతో కూతురు అశ్విని తన మామను వెంటబెట్టుకుని సోమవారం అనంతపురంలోని లలితానగర్‌లో రామాంజినమ్మ నివాసం ఉంటున్న ఇంటిని పరిశీలించారు. బీరువా ధ్వంసం చేసి ఉంది. అందులోని దుస్తులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. ఇంట్లోని సీసీ కెమెరా ఫుటేజీలను తొలగించి, హార్డ్‌డిస్క్ సైతం మాయం చేసినట్లుగా గుర్తించిన అశ్విని తీవ్ర భయాందోళనకు గురై, వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ఒక్క రోజు కూడా సెలవు పెట్టకుండా విధులకు హాజరయ్యే రామాంజినమ్మ అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వ్యక్తి దుర్మరణం

ఉరవకొండ: బొలెరో ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. నార్పల నివాసి నాగార్జున (38), బీకేఎస్ మండలం రేగడికొత్తూరుకు చెందిన మంగలి ఈశ్వరయ్య, ఉపేంద్ర ముగ్గురు కలసి ఓ ద్విచక్ర వాహనంపై సోమవారం ఉదయం బొమ్మనహాల్ మండలం ఉంతకల్లులోని పాండురంగస్వామి ఆలయంలో మాల ధరించడానికి బయలుదేరారు. ఉరవకొండ సమీపంలోని పాల్తూరు క్రాస్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన బొలెరో వాహనం ఢీకొంది. నాగార్జున అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఈశ్వరయ్య, ఉపేంద్రను స్థానికులు 108 అంబులెన్స్‌లో ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

జనరేటర్ ఏర్పాటు



జనరేటర్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, ఎస్పీ జగదీష్

అనంతపురం మెడికల్: ప్రభుత్వ వైద్య కళాశాలలో 24 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపేలా ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు చర్యలు తీసుకున్నారు. కరెంటు సమస్యతో తరచూ వైద్య విద్యార్థులకు ఇబ్బందిగా మారే పరిస్థితి ఉండేది. దీంతో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు విషయాన్ని డీఎంఈ, తదితర అధికారుల దృష్టికి తీసుకెళ్లి, జనరేటర్ ఏర్పాటు చేయించారు. సోమవారం వైద్య కళాశాలలో సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్, ఎస్పీ జగదీష్ తదితరులు జనరేటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు చంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ కృష్ణ, ఎగ్గుని రామాంజనేయులు, వేమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘డబ్బు అడిగితే చంపుతామంటున్నారు’

అనంతపురం టవర్‌క్లాక్: లోక్‌నాథ్ రెడ్డి తమను చంపుతామని బెదిరిస్తున్నాడు. అతడి నుంచి మాకు ప్రాణహాని ఉందని దామోదర సంజీవయ్య కాలనీకి చెందిన నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉప్పరపల్లి పొలంలో పేదలంతా కలసి దాదాపు 300 గుడిసెలు వేసుకున్నామన్నారు. వీటికి పట్టాలు, కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెపిస్తామంటూ లోక్‌నాథ్ రెడ్డి, జానకమ్మ డబ్బు వసూలు చేసినట్లు తెలిపారు. ఇటీవల వచ్చిన వరదలకు కాలనీలోకి నీరు రావడంతో గుడిసెలు ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారని పేర్కొన్నారు. తాము కట్టిన డబ్బు తిరిగి ఇవ్వమని అడిగినందుకు కులం పేరుతో దూషిస్తూ చంపుతామని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రామాంజనేయులు, వెంకటేష్ గౌడ్, లక్ష్మీదేవి, నాగరత్నమ్మ, శామల, పక్రుబీ, భారతి, రేష్మ, అభిద తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటుడిని దర్శించుకున్న కలెక్టర్



ఆలయ సిబ్బందితో కలెక్టర్ వినోద్ కుమార్

గుంతకల్లు రూరల్: కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సోమవారం రాత్రి కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. సోమవారం గుంతకల్లు పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం స్వామి దర్శనార్థం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అర్చకులు కలెక్టర్‌కు స్వామి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

గిరిజనులకు రిజర్వేషన్లు పెంచాలి

అనంతపురం అర్బన్: గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద ఒక్కరోజు నిరాహార దీక్ష చేశారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు ఇందల్ రాథోడ్ మాట్లాడుతూ.. గిరిజన రిజర్వేషన్ ఆరు శాతం నుంచి 12 శాతానికి పెంచాలన్నారు. తండా గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా చేసి అభివృద్ధికి రూ.5 కోట్ల నిధులు కేటాయించాలని కోరారు. మైదాన ప్రాంతంలో నివసిస్తున్న బంజారా గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యత, నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్నారు. గోర్‌బోలి భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు వెంకట్ బంజారా, రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు రవినాయక్ పాల్గొన్నారు.

సజావుగా వేలం

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయం ఆదాయం ఈసారి గణనీయంగా తగ్గిపోనుంది. సోమవారం ఆలయంలోని కల్యాణ మండపం సప్లయ్ సామాన్లు, ఫ్లవర్ డెకరేషన్, లైటింగ్ డెకరేషన్ కోసం ఎండోమెంటు అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. అయితే గతేడాది రూ.15.30 లక్షలకు పోగా ఈసారి కేవలం రూ.8.30 లక్షలకు అభిలాష్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు.

హరికృష్ణకు డాక్టరేట్

అనంతపురం: ఎస్కేయూలోని మేథమేటిక్స్ విభాగంలో పరిశోధన చేసిన ఎం.హరికృష్ణకు సోమవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు చెందిన సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ జీ.ప్రభాకర రావు పర్యవేక్షణలో అన్‌స్టీడే ఎంహెచ్‌డీ కన్వెక్టివ్ ఫ్లోవర్ త్రూ ప్లానర్ చానల్స్ అంశంపై ఫ్లూయిడ్‌డైనమిక్స్‌పై పరిశోధన చేశారు. ఈ అంశంపై జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌ను ప్రచురించారు.

కమ్మేస్తున్న పొగ

- కంపోస్టు యార్డుతో భయం.. భయం
- అకస్మాత్తుగా చెలరేగుతున్న మంటలు
- చుట్టుపక్కల ప్రాంత ప్రజలకు ప్రత్యక్ష నరకం
- హామీ నెరవేర్చని ఎమ్మెల్యే దగ్గుపాటి



గుత్తి రోడ్డులోని డంపింగ్ యార్డు నుంచి పొగ వస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగర శివారులోని గుత్తి రోడ్డులో ఉన్న కంపోస్టు యార్డు నుంచి వెలువడే పొగతో నగర, రూరల్ ప్రాంత ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. కంపోస్టు యార్డులో ఎప్పుడు మంటలు చెలరేగుతాయో అని ఆ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భయాందోళనతో వణికిపోతున్నారు. రోజు టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతోంది. చెత్త నిర్వహణకు బ్రేక్ పడటంతో పరిస్థితి దారుణంగా తయారైంది. గత ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే కంపోస్టు యార్డును తరలిస్తామంటూ దగ్గుపాటి ప్రసాద్ ఇచ్చిన హామీలు మాటలకే పరిమితమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చెత్త నిర్వహణకు బ్రేక్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో కంపోస్టు యార్డులో బయో మైనింగ్ పనులు చేపట్టి చెత్త నిర్వహణ చేపట్టారు. దీంతో కాస్త సమస్య సద్దుమనిగింది. ఇప్పుడు చెత్త నిర్వహణకు బ్రేక్ పడింది. నగరంలోని 50 డివిజన్లకు సంబంధించి 74 సచివాలయాల పరిధిలో రోజూ 130 నుంచి 140 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. కాంపాక్టర్స్, ట్రాక్టర్లు, తదితర వాహనాలతో చెత్తను కంపోస్టుకు తరలిస్తున్నారు. దీంతో కంపోస్టు యార్డు 12 ఎకరాల్లో ఉంటే అందులో 9 ఎకరాల్లో చెత్తను డంప్ చేశారు. రోజు రోజుకు టన్నుల కొద్దీ చెత్త పేరుకుపోతోంది. చెత్త నిర్వహణ జరగకపోవడంతో భరించలేని వాసన వస్తోంది. దీనికి తోడు తరచూ కంపోస్టు యార్డులో మంటలు చెలరేగుతున్నాయి. దీంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగి.. దట్టమైన పొగ కమ్ముకుంటోంది. గుత్తి రోడ్డుతో పాటు రాజీవ్ కాలనీ, ఇస్కాన్ టెంపుల్, ఎర్రనేల కొట్టాలు, లెక్చరర్స్ కాలనీలను పొగ చుట్టేస్తోంది. దీంతో ప్రజలు ఇళ్లకు తలుపులు వేసుకుని ఉండాల్సి వస్తోంది. ఒక వేళ ఆ పొగను పీల్చేందుకు వీలుకాని పరిస్థితి. ఊపిరితిత్తులు, తదితర సమస్యలున్న వారి ప్రాణాలకు ప్రమాదం.

ప్రమాదాలకు ఆస్కారం

కంపోస్టు యార్డుకు ఆనుకుని ఫోర్‌వే రోడ్లు రెండు వైపులా ఉన్నాయి. అటువైపుగా భారీ వాహనాలు, కార్లు, తదితర ఫోర్ వీల్ వాహనాలు, ద్విచక్ర వాహనాల్లో ప్రజలు వెళ్తుంటారు. ఒక్కసారిగా దట్టమైన పొగ కమ్ముకోవడంతో ఎప్పుడు ప్రమాదాలు జరుగుతాయో తెలియని పరిస్థితి. ఆర్టీసీ బస్సులు ఇదే మార్గాన కర్నూలు, అనంతపురం వైపునకు వస్తుంటాయి. రోజూ వందల సంఖ్యలో వాహనాలు అటువైపుగా వెళ్తుంటాయి.

అనంతపురం నగరపాలక సంస్థ వివరాలు..	
డివిజన్లు:	50
సచివాలయాలు:	74
రోజు ఉత్పత్తి అయ్యే చెత్త:	130 నుంచి 140 టన్నులు
కంపోస్టు యార్డు స్థలం:	12 ఎకరాలు
ప్రస్తుతం చెత్త ఉన్నది:	9 ఎకరాలు

హామీ అమలులో విఫలం..

డంపింగ్ యార్డ్ తరలిస్తామంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఇచ్చిన హామీ బుట్టదాఖలైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు కంపోస్టు యార్డును తరలిస్తామంటూ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు కంపోస్టు యార్డు తరలింపు, చెత్త నిర్వహణపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

పొగ భరించలేకపోతున్నాం



ఉన్నఫలంగా పొగ కమ్మేస్తోంది. ఆ పొగ వాసన భరించలేకపోతున్నాం. వృద్ధులు, చిన్నపిల్లలకు ఏమవుతుందోనని భయమేస్తుంది. తలుపులు వేసుకుని ఉండాల్సి వస్తోంది. భోజనం చేయడానికి ఇబ్బందిగా ఉంటుంది. కంపోస్టు యార్డు నుంచి పొగ రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.
– పి.అంజలి, గృహిణి, లెక్చరర్స్ కాలనీ

శాశ్వత పరిష్కారం చూపాలి



నెలలో రెండు మూడుసార్లు పొగ వస్తుంది. ఆ రోజుల్లో నరకం చూడాల్సిందే. పొగ వస్తే మనుషులు కూడా ఎదురెదురుగా కనిపించరు. సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందుతున్న రోజుల్లో ఇటువంటి పరిస్థితులు ఎదురుకావడమేంటి? కంపోస్టు యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.
– రాజకుమార్, ఎర్రనేలకొట్టాలు

చెత్త నిర్వహణ చేపడతాం



కంపోస్టు యార్డులో తరచూ మంటలు వస్తున్న విషయం వాస్తవమే. చెత్త నిర్వహణ చేపట్టడానికి చర్యలు తీసుకోబోతున్నాం. రానున్న 15 రోజుల్లో కంపోస్టు యార్డులో చెత్తను తగ్గించేందుకు కార్యచరణ రూపొందించాం. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూస్తాం. కంపోస్టు యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం.
– నాగరాజు, నగరపాలక సంస్థ కమిషనర్

ర్యాగింగ్‌కు పాల్పడితే ఉపేక్షించం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శివప్రసాద్ యాదవ్, ఎస్పీ జగదీష్, ప్రిన్సిపాల్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవు. జీవితంలో ఏ కళాశాలలో కూడా ప్రవేశం ఉండదు. జైలు జీవితం కూడా అనుభవించాల్సి వస్తుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ర్యాగింగ్, డ్రగ్స్ నివారణ, హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ.. కళాశాలలో స్నేహపూర్వకమైన వాతావరణం కల్గి ఉండాలన్నారు. ఉన్నత లక్ష్యంతో ముందుకు వెళ్లాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి కృషి చేసి, ఉత్తమ వైద్యులుగా ఎదగాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారి జోలికి వెళ్లకూడదన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న ఉత్తమ కళాశాలల్లో ఒకటైన అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి కళాశాలకు మంచి పేరు తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షంషాద్ బేగం, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ మధుసూదన్, ఫోరెన్సిక్ హెచ్‌ఓడీ డాక్టర్ శంకర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుమన గోపిచంద్, డాక్టర్ గాలేటి చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



మేయర్ వసీంకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అనంతపురం కార్పొరేషన్: కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు సోమవారం నగరపాలక సంస్థ ముందు ధర్నా చేపట్టారు. రెగ్యులర్ కార్మికులకు సరెండర్ లీవ్ మొత్తం, జీపీఎఫ్ ఖాతాలు తెరవాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు చేయాలని కోరారు. యూనిఫాం, చెప్పులు, పరకలు, కుట్టు కూలి, గంపలు, టబ్బులు, సబ్బులు, తదితర వాటిని అందించాలని డిమాండ్ చేశారు. ఇంజినీరింగ్ కార్మికులకు 2011లో తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న మొత్తాన్ని ఖాతాలోకి జమ చేయాలన్నారు. వాటర్ వర్క్స్‌లో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 16 రోజుల సమ్మె కాలంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.12 వేల వేతనం నుంచి రూ.15 వేల వేతనం అమలు చేయాలన్నారు. అనంతరం మేయర్ వసీంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, సీఐటీయూ నాయకులు నాగేంద్ర కుమార్, శేషేంద్ర కుమార్, వెంకటేష్, రాజు, బాబు, శీన, నాగేంద్ర, రవి, జయరాం, హిమాంబి పాల్గొన్నారు.

దుకాణానికి రూ.35 వేలు ఇవ్వాల్సిందే..

- టపాసుల వ్యాపారుల నుంచి బలవంతపు వసూళ్లకు తెర లేపిన కూటమి నేతలు

అనంతపురం క్రైం: కూటమి నేతల దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. నిన్నటి దాకా మద్యం దుకాణాలపై పడి యథేచ్ఛగా వసూళ్లకు దిగిన తమ్ముళ్లు.. తాజాగా వారి దృష్టి టపాసుల వ్యాపారులపై మళ్లింది. నగరంలో ముఖ్య ప్రజాప్రతినిధికి అత్యంత సన్నిహితంగా ఉంటున్న ఇద్దరు టపాసుల వ్యాపారుల నుంచి డబ్బు వసూలు చేసే బాధ్యతలు తీసేసుకున్నారు. ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ.35 వేలు చెల్లించాలంటూ తలపై బాంబు పెట్టారు. ఇప్పటికే వ్యాపారులు రూ.1.20 లక్షలు ఖర్చు పెట్టుకుని లబోదిబోమంటుంటే మరో వైపు కూటమి నేతలు వసూళ్లకు తెరతీశారు. ఫలితంగా వ్యాపారులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. ఇది చాలా అన్యాయమంటూ టపాసుల వ్యాపారుల గ్రూపులో వాయిస్ మెస్సేజ్‌లతో ఆవేదన వెల్లడిస్తున్నారు. గతంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఇంతగా డబ్బు వసూలు చేసింది లేదని చెబుతున్నారు. తాజాగా సదరు ప్రజాప్రతినిధి అనుచరులమంటూ రంగంలోకి దిగిన ఇద్దరు తెలుగు తమ్ముళ్లు అడ్డగోలుగా వసూళ్లకు తెర లేపారు. దుకాణం పెట్టాలంటే ముందుగా రూ.35 వేలు చెల్లించాల్సిందేనని హెచ్చరిస్తున్నారు. చాలా మంది అంత అద్దె చెల్లించలేక.. వెనుదిరగాలని చూస్తుంటే మరి కొంత మంది కష్టమో నష్టమో చేసేది లేదంటున్నారు. రూ.12 వేలు చెల్లించాల్సిన అద్దెను ఏకంగా రూ.35 వేలకు పెంచడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే జీఎస్టీకి రూ.25 వేలు, అగ్నిమాపకశాఖ అనుమతికి అనధికారికంగా రూ.వెయ్యి, లైసెన్స్‌కు అధికారికంగా రూ.500 ఫీజు చెల్లించినట్లు వ్యాపారులు చెబుతున్నారు. సరుకుతో పాటు దుకాణంలో ఇనుప ర్యాక్‌లు, సరుకు రవాణా చార్జీ, దుకాణంలో కూలీలు, వారి ఖర్చులు ఇలా మొత్తంగా లెక్కిస్తే రూ.1.50 లక్షలకు పైగానే ఖర్చు పెట్టాల్సి వస్తుందంటున్నారు. ఈ భారం మొత్తం కొనుగోలు దారులపై మోపక తప్పదని వ్యాపారులు చెబుతున్నారు.

అక్రమ వసూళ్లకు అధికారుల పేర్లు

కూటమి నేతలు వ్యాపారుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్న డబ్బులో ఆయా శాఖల అధికారుల పేర్లు వాడుకుంటున్నారు. ప్రధానంగా రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీసు, కమర్షియల్ ట్యాక్స్ అధికారులకు మామూళ్లు ఇవ్వాలని చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బలవంతంగా వ్యాపారుల నుంచి డబ్బు వసూలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని టపాసుల వ్యాపారులు కోరుతున్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి

ఆత్మకూరు: ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మీనాయక్‌కు వినతిపత్రం అందించారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా రైతులకు ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఎటువంటి పథకాలు అందించలేదని మండిపడ్డారు. వెంటనే పేరూరు డ్యాం కాలువ పనులు ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివ, రామాంజినేయులు,నల్లప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.

మాట తప్పడం చంద్రబాబుకు అలవాటే



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: హామీలు ఇచ్చి మాట తప్పడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటే అని మేయర్ మహమ్మద్ వసీం సలీం మండిపడ్డారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. విద్యుత్తు చార్జీలను పెంచం అంటూ ఎన్నికల సభల్లో పదేపదే చెప్పిన చంద్రబాబు ఎందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా అప్పుడే ప్రజలపై బాదుడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కేవలం విద్యుత్తు చార్జీల భారం ద్వారానే రూ.6072.86 కోట్లు ప్రజలపై భారం వేశారన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా భారీగా విద్యుత్ చార్జీలను పెంచి మోసం చేస్తే ప్రజలు మిమ్మల్ని క్షమించరన్నారు. సూపర్ సిక్స్ అంటూ నమ్మించి ఇప్పటిదాకా ఒక్కటీ అమలు చేయలేదన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేశారని గుర్తు చేశారు.

ప్రభుత్వ అతిథి గృహంలో పార్టీ కార్యక్రమమా?



టీడీపీ సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే దగ్గుపాటి, తదితరులు

అనంతపురం క్రైం: ప్రభుత్వ కార్యాలయాలు, అతిథి గృహాలను టీడీపీ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. సోమవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం సుబ్రమణ్యం హాజరయ్యారు. గతంలో ఎన్నడు లేని విధంగా ప్రభుత్వ అతిథి గృహాలను పార్టీ కార్యక్రమాలకు వినియోగించడంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రజా ప్రతినిధులు బాధ్యత మరచి వ్యవహరిస్తుంటే అధికారులు సైతం చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది. దీనికి తోడు అధికార పార్టీకి చెందిన కొంత మంది నేతలు రాత్రి వేళ ఆర్అండ్‌బీ అతిథి గృహంలో చేరి మద్యం తాగి చిందులేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగిందని సంబంధిత శాఖలోని కొంత మంది అధికారులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధుల వరకు సరే.. అసలు ఎవరో కూడా తెలియని వారికి అతిథి గృహాలు అప్పగించడమేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కనీసం అతిథి గృహాలను ఎవరికి ఇస్తున్నాం? ఎవరు సేదదీరుతున్నారన్న వివరాలను సేకరించాలని ఆర్అండ్‌బీ అధికారులు కోరుతున్నారు.

మత్తుకు బానిస అయితే జీవితం అథోగతే

అనంతపురం: మత్తుకు బానిస అయితే జీవితం అథోగతి అవుతుందని జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం యాంటీ డ్రగ్స్ అడిక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాన్ని నాశనం చేసుకోకూడదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విశ్వనాథ రెడ్డి, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ కళ్యాణి రాధ, డాక్టర్ బి.ఓం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నిరోధక చర్యలు పటిష్టం

అనంతపురం: ర్యాగింగ్ నిరోధక చర్యలు పటిష్టంగా చేపట్టామని ఇటుకలపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ అన్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని మహిళా విద్యార్థుల వసతి గృహాల్లో యాంటి ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ చేస్తే ఏఏ చట్టాల కింద శిక్షలు పడతాయో వివరించారు. సీనియర్లు జూనియర్లతో స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కే.కృష్ణకుమారి, డిప్యూటీ వార్డెన్లు డాక్టర్ వి.మాధవి, డాక్టర్ కే.అనిత, ప్రొఫెసర్ ఎస్.అనిత, సంధ్యారాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన సంపూర్ణ పోషణ్ స్వస్థజీవన్



పోషక సంహిత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకుని ‘మంచి జీవితం, మంచి భవిష్యత్తు కోసం ఆహార హక్కు’ అనే అంశంపై స్థానిక ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల ఫుడ్ సైన్స్–టెక్నాలజీ, మైక్రోబయాలజీ, న్యూట్రిషన్–డైటిటిక్స్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టిన ‘సంపూర్ణ పోషణ్ స్వస్థజీవన్–2024’ సోమవారం ముగిసింది. అనంతరం పోషణ సంహిత పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, కరస్పాండెంట్ పీఎల్ఎన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ప్రభాకర రాజు, సభ్యుడు ఎర్రిస్వామి అధ్యాపకులు మంజువాణి, గౌషియా బేగం, స్వాతిరాణి, శ్రవణిక, మౌనిక, అస్పియా పాల్గొన్నారు.

‘ప్రజా సమస్యలు పక్కదారి పట్టిస్తున్నారు’

అనంతపురం టవర్‌క్లాక్: ప్రజా సమస్యలను పాలకులు పక్కదారి పట్టిస్తున్నారని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎంపీఎస్ శర్మ అన్నారు. సోమవారం స్థానిక ఎన్జీఓ హోంలో లెనినిజం–నేటి సవాళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడం లేదన్నారు. అంబానీ, ఆదానీకి కేంద్రం కొమ్ము కాస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, చంద్ర శేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, సత్యబోస్, బాషా, వీరభద్రయ్య, గోవింద రాజులు, హరి, లింగమయ్య, రమణయ్య, జిలాన్, నాగేంద్ర, లెనిన్, ఓబులేసు, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

హలో విద్యార్థీ.. చలో విజయనగరం

అనంతపురం ఎడ్యుకేషన్: హలో విద్యార్థీ.. చలో విజయనగరం అంటూ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు పిలుపునిచ్చారు. విజయనగరంలో నవంబర్ 27 నుంచి 30 వరకు ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని వెల్లడించారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో వాల్ పోస్టర్లను విడుదల చేశారు. జాన్సన్ బాబు, ఉపాధ్యక్షుడు కుళ్లాయిస్వామి మాట్లాడుతూ.. నూతన జాతీయ విద్యా విధానం వల్ల ఇప్పటికే రాష్ట్రంలో చాలా విద్యాసంస్థలు మూతపడ్డాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, రమణయ్య, రాష్ట్ర సమితి సభ్యులు వెంకట్ నాయక్ మహేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు మంజునాథ్, చందు, నాయకులు రాజేష్ పాల్గొన్నారు.

డిజిటల్ క్యాంపస్‌గా ‘సమర్థ్’

అనంతపురం: దేశవ్యాప్తంగా ఉండే ఉన్నత విద్యా సంస్థల అనుసంధానంతో ఏర్పడిన ‘సమర్థ్’ అతి పెద్ద డిజిటల్ క్యాంపస్‌గా మారనుందని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. సోమవారం ఐసీఐసీఐ బ్యాంకు ఫైనాన్స్ సిబ్బంది జేఎన్‌టీయూ వీసీతో సమావేశమయ్యారు. సమర్థ్ అనే సుపరిపాలన డిజిటల్ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడానికి తోడ్పాటు అందించాలని బ్యాంకు అధికారులు కోరారు.

ప్రీ ఆర్డీ క్యాంపునకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థి

అనంతపురం ఎడ్యుకేషన్: నవంబర్ 12 నుంచి 21 వరకు మహారాష్ట్ర యూనివర్సిటీలో జరగనున్న ప్రీ ఆర్డీ క్యాంపునకు అనంతపురం ఆర్ట్స్ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడు. తృతీయ సంవత్సరం బీజెడ్సీ విద్యార్థి డి.సంతోష్ నాయక్ ఎన్ఎస్ఎస్ యూనిట్–2 వలంటీర్‌గా క్యాంపులో పాల్గొననున్నాడు. ఈనెల 21 వరకూ ఎస్కేయూలో జరిగిన ప్రీఆర్డీ క్యాంపు సెలక్షన్‌లో సంతోష్ నాయక్ పాల్గొని ప్రతిభ చాటాడు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి, ఎన్ఎస్ఎస్ పీఓ విష్ణుప్రియ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జితేంద్ర, ఎన్ఎస్ఎస్ పీఓలు రామకృష్ణ, సోమశేఖర్, శ్రీనివాస్, అధ్యాపకులు అమృతలక్ష్మి, అక్బర్ బాషా, జీఎల్ఎన్ ప్రసాద్, అరుణ, కిరణ్, రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

రెమ్యునరేషన్ మంజూరు చేయాలి

అనంతపురం రూరల్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న సచివాలయ సిబ్బందికి రావాల్సిన రెమ్యునరేషన్ వెంటనే విడుదల చేయాలని సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు ఆర్డీఓ వసంతబాబును కోరారు. సోమవారం ప్రజా సమ్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, సుధాకర్, శివశంకర్, వరప్రసాద్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థికసాయం



ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న అపుస్మా నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: వరదల కారణంగా ఇటీవల విజయవాడలో చాలా ప్రాంతాలు అతలాకుతలమైన సంగతి తెలిసిందే. బాధితులకు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) తమవంతు అండగా నిలిచింది. ఉమ్మడి జిల్లా తరుపున రూ.10 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. అలాగే సంఘం రాష్ట్ర కమిటీ తరుపున రూ.75 లక్షల చెక్కు అందజేశారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కుసుమ పుల్లారెడ్డి, నాయుడు, నాగపీరయ్య ఉన్నారు. ఈ సందర్భంగా ప్రైవేట్ సూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని అపుస్మా నాయకుడు కుసుమ పుల్లారెడ్డి తెలిపారు.

ఎస్కేయూ కబడ్డీ జట్టు ఎంపిక

అనంతపురం: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలు ఈనెల 30 నుంచి నవంబర్ 3వ తేదీ వరకు జరగనున్నాయి. సోమవారం ఎస్కేయూ కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. తలారి మధు, ఎస్.మోహన్ కౌశిక్, పి.శ్రీనివాసులు, బి.వెంకటసాయి, కే.నాగశేఖర్ రెడ్డి, ఆర్.రాజశేఖర్, వై.వంశీ, ఏ.శివ, వై.ఆనంద్, ఎన్.యుగంధర్, ఎం.లోకేష్, ఎం.మధు జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ జి.వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ బాబు, ఎస్కేయూ స్పోర్ట్స్ సెక్రెటరీ డాక్టర్ బి.జెస్సీ తదితరులు క్రీడాకారులను అభినందించారు.

7 నుంచి కార్తీక ఉత్సవాలు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో నవంబర్ 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ కార్తీక మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే సునీతకు కార్తీక మాస ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. 17వ తేదీన తులసీదామోదర కల్యాణోత్సవం, జ్వాలా తోరణం, కార్తీక కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

నవంబర్ 22న ఏఐఎస్ఏ వర్సిటీ స్థాయి సదస్సు

అనంతపురం: ఏఐఎస్ఏ (ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్) అనంతపురం శాఖ తొలి వర్సిటీ స్థాయి సదస్సు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో నవంబర్ 22న జరగనుంది. సోమవారం ఇందుకు సంబంధించిన గోడపత్రికలను ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, నాయకులు బాలకృష్ణ, రాజు నాయక్, కృష్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు

అనంతపురం: చంద్రబాబు కొట్టాలలో బెల్టుషాపు నిర్వహిస్తున్న అక్కులప్ప కుమారుడు తలారి హరీష్ అలియాస్ హరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ కే.సాయినాథ్ తెలిపారు. 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

వ్యక్తిపై దాడి

అనంతపురం: నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో బెల్లం షాపు యజమాని సురేష్‌పై జిమ్ ట్రైనర్ దాడి చేసి గాయపరిచాడు. తన షాపు ఎదురుగా బైక్ పెట్టకూడదని చెప్పడంతో ఆగ్రహంతో తనపై భౌతిక దాడి చేశాడంటూ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సురేష్ ఫిర్యాదు చేశాడు. సురుష్ ముఖంపై గాయం కావడంతో సర్వజనాసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా.. తన భార్యను కామెంట్ చేయడంతో దాడి చేసినట్లు జిమ్ ట్రైనర్ పోలీసులతో పేర్కొన్నాడు.